గొత్తికోయల ఆవాసాల్లో భద్రాద్రి కలెక్టర్

గొత్తికోయ ఆవాసాల్లో పర్యటించి మాట్లాడుతున్న కలెక్టర్

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 27: జిల్లాలోని గొత్తికోయల ఆవాసాల్లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గురువారం పర్యటించారు. గొత్తికోయల జీవన స్థితిగతుల గురించి, వారికి అందుతున్న మౌలిక వసతుల గురించి తెలుసుకునేందుకు లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలమేది, మద్దిగుంపు గొత్తికోయ ఆవాసాలకు గురువారం ఆయన వెళ్లారు. మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్‌తో కలిసి గొత్తికోయల ఆవాసాలకు బైక్‌పై చేరుకున్నారు. ఆ ఆవాసాల్లో తాగునీటి గొత్తికోయలు ఏర్పాటుచేసుకున్న చెలమలను పరిశీలించారు. అక్కడ ఉన్న గొత్తికోయలతో ముచ్చటించి వారి జీవన విధానాలు, స్థితిగతులు, ఉపాధి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడాలని, పోడు కొట్టడం చట్ట వ్యతిరేకమని, ఎవరూ చెట్లను నరకవద్దని సూచించారు. గొత్తికోయల అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. విలువైన జీవితాన్ని అందించడానికి గాను, తాగునీరు, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. విలువైన జీవితాన్ని అందించేందుకు తాగునీరు; మౌలిక వసతులు కల్పించడానికి సరైన రహదారి మార్గం కూడా లేనందున చింతలమేదిలో నివసించే ఆరు కుటుంబాల వారు రోడ్డుకు చేరువగా రావాలని సూచించారు. అప్పుడు మౌలిక వసతులు, సౌకర్యాలు అందించేందుకు వీలవుతుందన్నారు. ఎంపీడీవో చలపతిరావు, మిషన్ భగీరథ డీఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాళోజీ అవార్డు గ్రహీత జయరాజుకు సన్మానం

జయరాజు దంతులను సన్మానించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 27: ప్రకృతి ప్రేమికుడు, ప్రజాకవి, ప్రకృతి కవి, కాళోజీ అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు, కొత్తగూడెం కార్మిక ఉద్యమనేత డాక్టర్ జయరాజును పలువురు ప్రముఖులు గురువారం సన్మానించారు. సింగరేణి భవన్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన పదవీ విరమణ ఆత్మీయ సభ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం జరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై సన్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ప్రకృతి ఆశ్రమంకో ఆర్డినేటర్ సుగుణారావు, వెంకన్న, అర్జునరావు, భాస్కర్ తదితరులు జయరాజు దంపతులను సన్మానించారు.

రేపు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 27: మార్చి ఒకటో తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ పంచాయతిల స్పెషల్ ఆఫీసర్లు, అధికారులు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

'ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి'

సమావేశంలో పోషక పదార్థాల చిత్రాన్ని చూపుతున్న నాగజ్యోతి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 27: మహిళలు తాము తీసుకునే ఆహారం, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి నాగజ్యోతి సూచించారు. 'ఆహారం – ఆరోగ్యం' అనే అంశంపై కిన్నెర మండల మహిళా సమాఖ్య మహిళలకు పాల్వంచలోని స్త్రీశక్తి భవనంలో గురువారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన పదార్థాలను తీసుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అధికారులు సుభాష్, రమాకాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల బుక్‌లెట్ల అందజేత

మాట్లాడుతున్న ఎంఈవో ప్రభుదయాళ్

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 27: ఈసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం సాధారణ జవాబు పత్రాలు స్థానంలో బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బుక్‌లెట్లు 24 పేజీలతో, 12 పేజీలతో ఉంటాయి. ఈ బుక్‌లెట్లను కొత్తగూడెం మండలంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల సెంటర్ల ముఖ్య నిర్వాహకులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు ఎంఈవో డాక్టర్ ప్రభుదయాళ్ అందజేశారు. అనంతరం వాటి గురించి వివరించారు.

రెండు కార్లు ఢీ.. నలుగురికి గాయాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 27: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో రెండు వాహనాల్లో ఉన్న నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని వినోభానగర్ సమీపంలోని ప్రధాన రహరిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏన్కూరు వైపు నుంచి కొత్తగూడెం వైపునకు వెళ్తున్న కారు.. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న మరో కారు వినోభానగర్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. వాటిల్లో ప్రయాణిస్తున్న శ్రీనివాస్, తిరుమలరావు, ప్రశాంత్, రామారావులకు గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్ వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టుల కుట్ర భగ్నం

మందుపాతర నిర్వీర్యం చేసిన భద్రతా దళాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 27: భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను జవాన్లు గుర్తించారు. అనంతరం దానిని నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కొంట – గొల్లపల్లి రహదారిలోని బండ గ్రామ సమీపంలో భద్రతా దళాలను హతమార్చేందుకు మావోయిస్టులు ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ)ని అమర్చారు. ఈ ప్రాంతంలో విధులు నిర్వర్తించిన సీఆర్‌పీఎఫ్ 228 బెటాలియన్‌కు చెందిన భద్రతా దళాలు ఐఈడీని గుర్తించి వెలికి తీసి దాన్ని నిర్వీర్యం చేశాయి.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ముగిసిన 'ఎమ్మెల్సీ' పోలింగ్

నల్లగొండ – వరంగల్ – ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ భద్రాది జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఇందుకోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ రోహిత్‌రాజు పరిశీలించారు. కొత్తగూడెం సింగరేణి కాలరీస్ బాలికల ఉన్నత పాఠశాల, పాల్వంచ బొల్లోరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ విధులు నిర్వహించే అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 పోలింగ్ కేంద్రాల్లో 2,022 మంది ఓటర్లకు గాను 1,859 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
-నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 27

పాల్వంచలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు

టేకులపల్లి: పోలింగ్ కేంద్రం వద్ద జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్

మణుగూరు టౌన్: పోలింగ్ సరళి పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

అన్నపురెడ్డిపల్లి: ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

ఆళ్లపల్లి: ఓటు హక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు

బూర్గంపహాడ్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

చండ్రుగొండ: ఓటు వేస్తున్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెంలో...

దమ్మపేట: ఓటు వేసి సిరా చూపుతున్న ఉపాధ్యాయులు

మణుగూరు టౌన్: ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు

అశ్వారావుపేట: ఓటు వేసిన ఉపాధ్యాయుడు

కరకగూడెం: సిరా చుక్క చూపుతున్న ఉపాధ్యాయురాలు

'చిన్నారి విశ్వామిత్ర'కు 'కాకతీయ' పురస్కారం

మాజీ మంత్రి హరీశ్‌రావు నుంచి పురస్కారం అందుకుంటున్న విశ్వామిత్ర చౌహాన్

చుంచుపల్లి, ఫిబ్రవరి 27: పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు బాధ్యతగా ప్రతి రోజు మొక్కలు నాటుతున్న కొత్తగూడెం బాలుడు, ప్రకృతి ప్రేమికుడు చిన్నారి విశ్వామిత్ర చౌహాన్‌కు కాకతీయ పురస్కారం దక్కింది. అదేవిధంగా ఇంగ్లాండ్ వేదికగా ఉన్న అత్యంత ప్రతిష్టాత్మకమైన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లోనూ ఇతడి చొరవకు చోటు లభించింది. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి సందర్భంగా ఇండస్, వాక్ ఫర్ ట్రీస్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో హన్మకొండలో ఇటీవల నిర్వహించిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ చిన్నారిని అభినందించి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ చిన్నారిని ఆదర్శంగా చేసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని.. తీవ్ర గాయాలు

పర్ణశాల, ఫిబ్రవరి 27: రాత్రి వేళ.. రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొంది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మట్టి తోలుతున్న ట్రాక్టర్, బైరాగులపాడు గ్రామ శివారులోని రోడ్డుపై గురువారం ఆగిపోయింది. దానిని డ్రైవర్ అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఆ రాత్రి 8.30 గంటల సమయంలో, అదే దారిలో బైక్‌పై పెద్ద బండ్రేవు గ్రామస్తుడు వీరభద్రం వెళ్తున్నాడు. ఆగి ఉన్న ఆ ట్రాక్టర్‌ను వెనుక భాగాన్ని వీరభద్రం బైక్ ఢీకొంది. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది వచ్చి, దుమ్ముగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దుమ్ముగూడెం పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని ధర్మాపురం గ్రామంలో వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులను బహుమతులను పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ళ రమేష్ ప్రదానం చేశారు. నాయకులు రామచంద్రయ్య, ఉపేందర్‌రావు, చింత ఎర్రయ్య, బుచ్చయ్య, లాలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

శిక్షణ అందించనున్న రిసోర్స్ పర్సన్లు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 27: డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన 258 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి మార్చి 3 వరకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి గురువారం తెలిపారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యాశాఖ శిక్షణ కేంద్రంలో జరిగే ఈ శిక్షణ కార్యక్రమం నిర్ణీత తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అన్నారు. నూతన విద్యా విధానంలో పిల్లలకు తరగతి గదిలో సాగించాల్సిన బోధన అభ్యాసన కృత్యాలు, వర్క్‌బుక్, టెక్స్ట్ బుక్‌ల ఉపయోగాలు, బహుళ తరగతి బోధన, పరీక్షా విధానాలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. భద్రాద్రి జిల్లాకు చెందిన 12 మంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో శిక్షణ పొంది వచ్చారు. ఈ 12 మంది ఆర్పీల ద్వారా శిక్షణ ఉంటుంది. శిక్షణకు సమన్వయ అధికారిగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వ్యవహరించనున్నారు.

అవినీతికి అడ్డా.. దమ్మపేట తహసీల్!

- ఏ పనికైనా పైసలిస్తేనే ఫైల్ కదిలేది..
- షాడో ఆమోదంతోనే చకచకా పనులు
- అసంతృప్తిలో కార్యాలయ ఉద్యోగులు

దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం

దమ్మపేట రూరల్, ఫిబ్రవరి 27 : అవినీతికి అడ్డాగా మారిన దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏ పనికైనా ముందుగా నిర్ణయించిన ధర చెల్లించినట్లైతే పనులు ఇట్టే పూర్తవుతాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవలి కాలంలో కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ సర్వేయర్‌పై ఏసీబీ దాడి జరిగినా ఉన్నతాధికారుల తీరు మారడం లేదని బాహాటంగా చెప్పుకుంటున్నారు. పలు దరఖాస్తులకు కిందిస్థాయి ఉద్యోగుల నుంచి సిఫార్సులు పూర్తయినా ఒక షాడో ఆమోదం తెలిపితే తప్ప మోక్షం కలగడం లేదని తెలుస్తున్నది. ఇలాంటి వ్యవహారాలపై కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

నాళా కన్వర్షన్‌కు రూ.15 వేల బేరంతో పూర్తి

దమ్మపేట రెవెన్యూలోని వ్యవసాయ భూమిని నాళా కన్వర్షన్ చేయాలని ఒక వ్యక్తి కార్యాలయంలో సంప్రదించాడు. అయితే నాళా కన్వర్షన్ కుదరదని ఆ వ్యక్తిని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో షాడో ద్వారా ఆ వ్యక్తిని మరో దళారీతో సంప్రదింపులు జరిపారు. నాళా కన్వర్షన్ ఆ అధికారి సన్నిహితుడి ద్వారా చేయిస్తానని, దీనికి రూ.35 వేలు అవుతుందని రేటు మాట్లాడుకున్నారు. ఇంత చిన్న పనికి ఇంత పెద్ద మొత్తం ఇవ్వలేనని, ఓ స్థానిక నాయకుడి వద్దకు ఈ వ్యవహారాన్ని నాళా చేయించుకునే వ్యక్తి తీసుకెళ్లాడు. సదరు నాయకుడు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేస్తున్నా మీ అవినీతి ఆగడం లేదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ధరను కాస్త తగ్గించి రూ.15 వేలు తీసుకుని నాళా కన్వర్షన్ పూర్తి చేశారు.

రూ.50 వేలకు ఆదాయ ధ్రువీకరణ పత్రం

రూ.50 వేలు తీసుకుని ఒక వ్యక్తికి తక్కువ ఆదాయం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ముష్టిబండ రెవెన్యూలో ఆ వ్యక్తి పేరుతో పదెకరాల వ్యవసాయ భూమి, వర్జీనియా పొగాకు బ్యారన్ లైసెన్సు, సొంత కారు, ట్రాక్టర్, బంగ్లా ఉన్నాయి. ఇంతటి మోతుబరికి కేవలం రూ.95 వేలు మాత్రమే ఆదాయం వస్తుందని ధ్రువీకరణ పత్రం ఇవ్వడం శోచనీయం. కాగా.. అనర్హుడికి ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇచ్చారన్న విషయాన్ని ఇంచార్జి తహసీల్దార్ వాణి దృష్టికి తీసుకెళ్లగా.. తెల్ల కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇస్తామని చెప్పారు. ఆ వ్యక్తికి ఉన్న ఆస్తులను ప్రస్తావించగా.. అవన్నీ తమకు అవసరం లేదని, ఎంఆర్ఐ నివేదికతో ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇచ్చామని వివరణ ఇచ్చారు.

రైతుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్న అవినీతి అధికారులు

రైతుల బలహీనతను ఆసరా చేసుకుని అవినీతి అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. తమ పరిధిలోనే విధులు నిర్వహిస్తూ లంచాల పర్వం కొనసాగిస్తున్నారు. లంచాలు ఇవ్వనిదే పని కాని స్థితిలో లంచాలు ఇచ్చినా బయటకు చెప్పుకోలేని రైతులు, పేదల బలహీనతే అవినీతిపరులకు కొండంత బలంగా మారింది.

నల్లబ్యాడ్జీలు ధరించి ఎన్ఎండీసీ కార్మికుల నిరసన

వేతన సవరణ చేయాలని వివిధ సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్

పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ కర్మాగారం గేట్ వద్ద నిరసన చేపట్టిన కార్మికులు

పాల్వంచ, ఫిబ్రవరి 27 : తక్షణమే ఉద్యోగులు, కార్మికుల వేతన సవరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కర్మాగారమైన స్పాంజ్ ఐరన్ ఎన్ఎండీసీ(నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్మికులు వివిధ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి పాల్వంచలోని కర్మాగారం గేటు వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ 2025, జనవరి ఒకటో తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి నెల రోజులు దాటినా యాజమాన్యం స్పందించలేదన్నారు. దీంతో వివిధ కార్మిక సంఘాలతో కలిసి నిరసనకు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, నాయకులు బానోత్ బాలునాయక్, భద్రం, సెక్రటరీ ఆగ రత్తయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, లాలేందర్, లక్ష్మణ్, రుక్యా, శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన

పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 27: మండలంలో గురువారం అదనపు కలెక్టర్ విద్యాచందన ఆకస్మికంగా పర్యటించారు. బట్టిగూడెం, మహాదేవపురం పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఫారం పాండ్, మడకం నాగయ్య మునగ తోట పనులను పరిశీలించారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలని, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఈజీఎస్ ఏపీవో సుకన్య, ఈసీలు అప్పారావు, రాజు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, కార్యదర్శులు హనుమంతు, శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్లు సీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో రాహుల్ పర్యటన

రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని రాయిపాడు గ్రామంలో గురువారం ఐటీడీఏ పీవో రాహుల్ పర్యటించారు. రాయిపాడు ఎఫ్‌పీవో రైతుల పంటలను పరిశీలించి, వారితో సమావేశమయ్యారు. ఏపీవో ఉదయ భాస్కర్, ఎఫ్‌పీవో చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ మర్రిమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నిజాయితీ విలువ'కు గుర్తింపు

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 27: కెనడాలోని 'తెలుగు తల్లి' సంస్థ నిర్వహించిన కథల పోటీలో అశ్వారావుపేటకు చెందిన బాల కథారచయిత సిద్దాంతపు సాత్విక్ పంపిన కథ 'నిజాయితీ విలువ'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ధ్రువీకరణ పత్రాన్ని మెయిల్ ద్వారా సాత్విక్‌కు ఆ సంస్థ పంపింది. సాత్విక్ తండ్రి, కవి ప్రభాకరాచార్యులు గురువారం ఈ వివరాలు తెలిపారు.

'సీతారామ' నుంచి నీటి విడుదల

బీజీ కొత్తూరు వద్ద పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

అశ్వాపురం, ఫిబ్రవరి 27: మండలంలోని బీజీ కొత్తూరు వద్దనున్న సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌజ్-1 నుంచి పాలేరు ఎన్ఎస్‌పీకి నీటిని అధికారులు గురువారం విడుదల చేశారు. పంప్ హౌజ్-1 నుంచి పంప్ హౌజ్-2 మధ్య లోగల కెనాల్‌ను నింపి, అక్కడి నుంచి నీటిని దిగువకు పంపుతున్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 27: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం సీతారామచంద్ర స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

భద్రాచలం, ఫిబ్రవరి 27: ఆర్టీసీ భద్రాచలం డిపోలో శుక్రవారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 9959225960 నంబర్‌కు పైన తెలిపిన వేళలో తెలపవచ్చని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

కరకగూడెం, ఫిబ్రవరి 27: మండలంలోని భట్టుపల్లి సమీప అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ రాజేందర్ నేతృత్వంలో పోలీసులు గురువారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,500, ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణాలను సకాలంలో చెల్లించండి

ములకలపల్లి, ఫిబ్రవరి 27: డీసీసీబీ ములకలపల్లి బ్రాంచి నుంచి తీసుకున్న రుణాలను రైతులు, పశువుల యజమానులు సకాలంలో చెల్లించాలని బ్రాంచ్ మేనేజర్ ఒక ప్రకటనలో కోరారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న ఏకైక బ్యాంకు తమదేనని పేర్కొన్నారు. గోల్డ్ లోన్ అత్యధికంగా గ్రాముకు రూ.5800 రుణం ఇస్తున్నట్లు తెలిపారు.

నేడు వైద్య శిబిరం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 27: మండలంలోని పగిడేరు యూపీఎస్‌లో శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డాక్టర్ నిశాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పగిడేరు, పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆర్థో, ఆప్తమాలజీ, డెర్మటాలజీ వైద్యులు అందుబాటులో ఉంటారని వివరించారు.

పూనెం పుల్లమ్మకు నివాళి

టేకులపల్లి, ఫిబ్రవరి 27: బూర్గంపహాడ్ మాజీ ఎమ్మెల్యే, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పూనెం రామచంద్రయ్య సతీమణి పూనెం పుల్లమ్మ(90) గురువారం ఉదయం అనారోగ్యంతో మండలంలోని కోయగూడెంలోగల స్వగృహంలో మృతి చెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు గురువారం సందర్శించి నివాళి అర్పించారు.